క్లుప్తంగా

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ సాధ్యం



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గుడిపాల: టీకాలతో గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని మండల పశువైద్యాధికారులు సాయిమాధవి, రవితేజ అన్నారు. మండలంలోని పానాటూరు, వసంతాపురంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ ఈ వ్యాధి వల్ల పశువుల్లో మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు పశువులకు టీకాలు వేయించాలని కోరారు. పశువులలో తీవ్రమైన జ్వరం, నీరసం కొద్దిపాటి ఎండకే పశువులు నీరసించిపోవడం, ఎడ్లలో పని సామర్థ్యం తగ్గటం వంటి లక్షణాలు గాలికుంటు వ్యాధికి సంబంధించినవేనని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అబ్దుల్లా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వరిగపల్లె పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

యాదమరి: మండల పరిధిలోని వరిగపల్లె ఉన్నత పాఠశాలను డీవైఈఓ చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పాఠశాలలోని రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని రుచి చూశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుడి ఆరా తీశారు. చివరగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు బాగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. ఈ సారి పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల క్యాంటీన్‌లో ఎన్నికల ప్రచారం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని మాజీ సైనికుల క్యాంటీన్‌లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మాజీ సైనికుడు కమ్మిశెట్టి భాస్కరరావు కరపత్రాలను మాజీ సైనికులకు అందజేశారు. అనంతరం ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు గోవిందరాజు, నరసింహులు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చర్చివీధిలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్: నగరంలోని చర్చివీధిలో గురువారం చిత్తూరు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మురళి, రాజేంద్రప్రసాద్, అరుణ్, గిరి, గుణ, దొరై, సాయి పాల్గొన్నారు.

ఆపస్ కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మండల కార్యవర్గం ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామి వెల్లడించారు. వారు మాట్లాడుతూ గురువారం నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న ఎంసీపీఎస్‌లో మండల స్థాయి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎస్జీటీలుగా పని చేస్తున్న కె.గోపినాథ్ అధ్యక్షులుగా, రాజా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకైనట్లు వెల్లడించారు.

మండల సమావేశం రేపు

బంగారుపాళెం: మండల సర్వసభ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీప అమరావతి అధ్యక్షతన సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వేలంపాట వాయిదా

పుంగనూరు: మున్సిపాలిటీకి చెందిన వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, మరుగుదొడ్లు, ఖాళీ రూములకు వేలంపాట గురువారం వేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

ఉపాధి వనం



మామిడి చెట్ల చుట్టూ కందకాలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవనానికి అనుసంధానం చేయడంతో రైతులకు వరంలా మారింది. వ్యవసాయ సంబంధిత పనులన్నీ ఉపాధి కింద చేపట్టడంతో సత్ఫలితాలను అందిస్తోంది. గుండ్రని కందకాలు తవ్వడం ద్వారా చెట్టుకు నేరుగా సరైన పోషణ అందుతోంది. చెట్టు ఎదుగుదలలో వేగం పుంజుకుంటోంది. దీంతో రైతులకు ఈ ఉద్యాన ఉపాధి పనులపై ఆసక్తి పెరిగింది. తద్వారా మామిడి తోటల్లో మంచి దిగుబడి సాధించేందుకు ఈ పథకం రైతుకు తోడ్పాటునందిస్తోంది. ఉపాధి హామీ పథకం మండలంలో పకడ్బందీగా అమలవుతోంది.

- ఉద్యానవనానికి ఉపాధి అనుసంధానంతో సత్ఫలితాలు
- మండలంలోని మామిడి తోటల్లో విరివిగా ఉపాధి హామీ పనులు
- ఆసక్తి చూపుతున్న రైతులు
- చెట్టు చుట్టూ కందకాల తవ్వకం

ఐరాల: మండలంలో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. కూలీలు కూడా పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 221 పనులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి పనుల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. పనుల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న మహిళలను ప్రభుత్వం మేట్లుగా అవకాశం కల్పించింది. తద్వారా కూలీల సంఖ్య పెంచాలని సూచించింది. మండలంలో 105 మంది మహిళా మేట్లు ఉండడం విశేషమే. పనుల్లో పాల్గొంటున్న కూలీల్లో అధికంగా మహిళలే ఉంటున్నారు. రెండు పూటలా పనులు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించడంతో పశువుల కాపరులు సైతం ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఉపాధిపై రైతుల ఆసక్తి

ఉపాధి కింద పొలాల్లో చేపట్టిన పనులు సత్ఫలితాలు ఇవ్వడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే ఉపాధి కింద మామిడి మొక్కల పెంపకానికి ముందుకు వస్తున్నారు. మండలంలో 4 వేల హెక్టార్లలో మామిడి మొక్కల పెంపకం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి కింద మామిడి చెట్టుకు చుట్టూ గుండ్రని కందకాలు (రింగ్ ట్రెంచ్‌లు) తవ్విస్తున్నారు. ఫలితంగా గత ఏడాది అధికంగా దిగుబడి వచ్చిందని, యాజమాన్య పద్ధతులు అనువుగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలం చుట్టూ కందకాలు తవ్వుకునేందుకు రైతులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. అంతేగాక ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు చేసుకోవడానికి, పశువులకు గడ్డి పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

ఐరాల మండలం ఉపాధి వివరాలు

జాబ్ కార్డుల సంఖ్య	-	9,312
మొత్తం కూలీల సంఖ్య	-	15,722
మహిళా మేట్ల సంఖ్య	-	105
పురుషుల కూలీల సంఖ్య	-	7,625
మహిళల కూలీల సంఖ్య	-	8,097
ఒక్క రోజుకు చెల్లిస్తున్న వేతనం	-	రూ.249.26
మంజూరైన పనుల సంఖ్య	-	221
రోజులో పని చేస్తున్న కూలీల సంఖ్య	-	1,350

పనులు వేగవంతం చేయాలి

తవణంపల్లె: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి సూచించారు. మండలంలోని దిగువ మోదలపల్లె, టి.పుత్తూరు, దిగువ తడకర, కొండ్రాజుకాలువ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను, జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇండ్ల నిర్మాణం పనులను గురువారం పరిశీలించారు. వేసవిలో ఉపాధి పనులను కూలీ రేట్లను ప్రభుత్వం పెంచుతుందని వివరించారు. కూలీలు అధికంగా వచ్చి పెంచిన రేట్లకు అనుగుణంగా పనులు చేసుకొని ఉపాధి పొందాలన్నారు. ఉగాదికి జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు వివరించారు. ఎంపీడీఓతోపాటు ఏపీఓ లలిత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఓ లలిత

రింగ్‌ట్రెంచ్‌లు తవ్వుకున్నా

నాకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఉపాధి కింద రెండెకరాలకు రింగ్ ట్రెంచ్(కందకాలు) తవ్వించాం. ఫలితంగా చెట్టు ఎదుగుదల ఊపందుకుంది. ఎరువుల వృథా కూడా తగ్గింది. నీరు, ఎరువు నేరుగా చెట్టుకే చేరుతున్నాయి. తోట యాజమాన్య నిర్వహణ సులువైంది. మామిడి రైతులకు ఉపాధి హామీ వరం.

\- అమర్నాథరెడ్డి, మామిడి రైతు, చిన్నకాంపల్లె



ఉన్నచోటే ఉపాధి

ఉన్న చోటే ఉపాధి పనులు చేసుకుంటున్నాం. ప్రతి రోజూ పనికి వెళుతున్నాం. రోజుకు రూ.249 కూలి ఇస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడు ఉపాధి పథకం ద్వారా చాలా మందికి పనులు మంజూరు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడం సంతోషంగా ఉంది.



\- రమాదేవి, గుట్టకిందపల్లె.

కూలీల సంఖ్య పెరిగింది

ఐరాల మండలంలో ఉపాధి కూలీల సంఖ్య బాగా పెరిగింది. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో పేదలకు ఉపాధి పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. కోరిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. రైతుల నుంచి కూడా విశేష స్పందన ఉంటోంది. ఎక్కువ మంది మామిడి మొక్కల చుట్టూ ట్రెంచ్‌లు తవ్వుకుంటున్నారు. కూలీల సంఖ్య ఇంకా పెంచేందుకు కృషి చేస్తున్నాం.



\- సంధ్య, ఏపీఓ, ఐరాల

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ప్రతి ఓటర్ వద్దకు వెళ్లండి
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అందులో భాగంగా ప్రతి ఓటరు ఇంటి వద్దకు వెళ్లి ప్రచారం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 7,942, ఉపాధ్యాయుల ఓట్లు 943 ఉన్నాయని చెప్పారు. మార్చి 13న జరగనున్న ఎన్నికల్లో పోలింగ్ కోసం చిత్తూరులో 10, గుడిపాలలో 2 బూత్‌లు ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సహకారంతో ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి మన ప్రభుత్వం చేస్తున్న మంచిని తెలపాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్యాంప్రసాద్‌రెడ్డి ఎదురుగా ఒకటో నెంబరు సంఖ్యను వేయాలన్నారు. రెండు, మూడు ఓట్లు ఎవరికి వేయరాదని చెప్పారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 12 శాతం చెల్లని ఓట్లు నమోదైనట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం 36 నియోజకవర్గాల్లో 3 లక్షల మంది ఓట్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇక నుంచి ప్రతి డివిజన్‌లో వలంటీర్ల సహకారంతో ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేసి వారిలో చైతన్యం కల్పించాలన్నారు. నాయకులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు అందరూ సమిష్టగా కలిసి పనిచేయాలని మేయర్ అముద సూచించారు. ఎన్నికల సమయం దగ్గర పడిందని ఎవరికైనా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా స్థానిక నాయకుల దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సచివాలయ కన్వీనర్లు ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకొని పనిచేసి ఫలితం చూపించాలని నియోజకవర్గ కన్వీనర్ల ఇన్‌చార్జిలు రాంగణేష్, కిరణ్, సాయి, విశాల్ కోరారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జెడ్పీటీసీ బాబునాయుడు, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు జ్ఞానజగదీష్, భాగ్యలక్ష్మి, నాయకులు త్యాగ, సంపత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచారం

గుడిపాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పట్టభద్ర నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్న దయాకర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సోమనాథ్‌గౌడ్ కోరారు. ఆయన గురువారం మండలంలో పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి దయాకర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆయనతోపాటు ఉపాధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి సుభాష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సహకార బంధును సద్వినియోగం చేసుకోండి

బంగారుపాళెం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అమలు చేసిన సహకారబంధు డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ గంగిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులో మాట్లాడుతూ, సహకార బంధు పథకం కింద డిపాజిట్లు చేసుకునేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి 20 వరకు అవకాశం ఉందన్నారు. కనిష్ట డిపాజిట్ రూ.1000 పైబడి స్వీకరించనున్నట్లు తెలిపారు. పథకం కింద డిపాజిట్ చేసే జనరల్ వ్యక్తులకు 7.70 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.54 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై డిఐసిజిసి ఇన్సూరెన్స్ రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మణ్‌రెడ్డి, ప్రభావతి, సింగిల్‌విండో సీఏఓ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు



చెర్లోపల్లిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిత్తూరు రూరల్: గృహ నిర్మాణంలో నిర్లక్ష్యం ఉండకూడదని, అధికారులు, సిబ్బంది లక్ష్యం కోసం పని చేయాలని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ సూచించారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో గురువారం ఆయన గృహ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. గ్రామంలో ఎంత మందికి గృహాలు మంజూరయ్యాయి. అవి ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి? అన్న విషయాలపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. లబ్ధిదారులను పిలిచి మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనుల్లో జోరు పెంచాలన్నారు. నిర్ణీత సమయానికి లక్ష్యం పూర్తికావాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందుబాటులో వైద్యం



ఎగువ మత్యంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ముంగిట్లో వైద్యం అందుతోందని, మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి తెలిపారు. ఆయన గురువారం మండలంలోని ఎగువ మత్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గౌరి

పూతలపట్టు: అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని గాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలోనే భోజనం చేయాలని కార్యకర్తలకు తెలియజేశారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. స్పందనలో వచ్చిన అర్జీలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం గాండ్లపల్లి లేఔట్‌లను పరిశీలించి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు తెలియజేశారు. లబ్ధిదారులు గృహ ప్రవేశానికి శుభ ముహూర్తం తొందరలో ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎంపీటీసీ సభ్యురాలు రాణి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి

ఐరాల: చదువుపై దృష్టి పెట్టి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ఆయన గురువారం మండలంలోని తాళంబేడువారిపల్లె, గుడిపల్లె పాఠశాలలను సందర్శించారు. అకడమిక్ రికార్డులను పరిశీలించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల నోట్ పుస్తకాలను ప్రతి రోజూ చెక్ చేసి తప్పులను సరిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్‌ఏ–1 జవాబు పత్రాలను పరిశీలించి సూచనలు చేశారు. ఎఫ్‌ఏ–4, పదో తరగతి పరీక్షల సమయం దగ్గరపడుతుందని, ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని సూచించారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS : CHITTOOR

ARC No.140/2022

Between: M/s Dhanalakshmi Srinivasan chit Funds (Andhra) Pvt. Ltd., Chittoor Rep. by its Manager / Foreman... Disputant

Vs.

P.Sathish& Others...Opponents

Opponent No.2: Mrs. V.Kavitha, W/o.P. Sathish, D.No.2-894, Chenna Reddy Colony, Seshapillar Road, Kongareddypalli, Chittoor -517001

Opponent No.5: Mrs. P.Rukmani W/o. G.Palanimudaliar, D.No.2-894, Chenna Reddy Colony, Seshapillar Road, Kongareddypalli, Chittoor -517001

Please take notice that above dispute is posted to 25.03.2023 for your appearance before the above said Honourable Deputy Registrar of Chits, Chittoor at 10.30am either in person or through an advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.

Hg. Date: 25.03.2023

C.SURESH REDDY, B.A., B.L.,
Advocate, Chittoor

శాస్త్రోక్తం..గోపూజోత్సవం!





ఆలయంలోని యాగశాల వద్ద గోపూజ నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు, గ్రామోత్సవంలో ఆలయ పాలకమండలి సభ్యులు

కాణిపాకం(యాదమరి): దేశంలోనే తొలిసారిగా కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష్మీ గణపతి హవనంలో భాగంగా గోపూజోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గురువారం రాత్రి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కలిసి వేద పండితుల ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పూజాధి కార్యక్రమాలకు ఆలయ చైర్మన్, ఈఓలకు ఆలయ అర్చకులు కంకణాలు కట్టారు. అనంతరం యాగశాలలో దేవతామూర్తులను కొలువుదీర్చి కలశాలు ఏర్పాటు చేసి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం మాడ వీధుల్లో వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ఆలయ పాలక మండలి చైర్మన్‌కు, ఈవోకు కంకణ ధారణ చేస్తున్న వేదపండితులు, యాగశాలలో వేడుకగా కలశపూజ చేస్తున్న అర్చకులు

ఓటు హక్కు వినియోగించుకోండి

యాదమరి: పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వయోజన విద్యాశాఖ డీడీ నాగేశ్వర్ రెడ్డి కోరారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందికి రెవెన్యూ, పంచాయతీ అధికారులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ఓటింగ్ పద్ధతిని తెలియజేశారు. ఈ అంశాలను ఓటర్లయిన పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు, ఏపీఓ హరినాథ రెడ్డి, పర్యవేక్షకులు కందేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.